

# వృత్తి ప్రవృత్తి నివృత్తి

**మబ్బున** లేచింది లక్ష్మమ్మ. ఇవాళ చాల పనుంటుంది. రత్తమ్మ గారిల్లు లంకంత ఇల్లు. అంతా సోడా, సర్ఫూ వేసి కడగాలి. ద్వారబంధా లన్నింటికి పసుపు రాసి బొట్లు పెట్టాలి. ఆపైన అయ్య మామూలు కాలకృత్యాలు సరే. తలంటుకుంటూ డివాళ. ఏది తప్పినా, ఈరోజు అది తప్పే వీలులేదు. బాసన్లు, ఆ తరువాత బట్టలు... తొందరగా వెళ్ళకపోతే తెప్పులడు. మామూలు రోజుల్లోనే తెవ్వుల నియ్యదు రత్తమ్మ దొరసాని. పది సంవత్సరాల అనుభవంగాదూ! సంవత్సరం పొడుగుతా ఎంత సణిగినా ఫరవాలేదు గాని, పండగ రోజు— ఇవ్వాళ ఎవర్నించీ మాట పడకుండా గడుపుకు పోవాలి.

బాలమ్మనీ లేపింది. కాసేపు గునిసి గునిసి ఇంక తప్పదు గావాలనుకుందేమో లేచింది బాలమ్మ.

ఇద్దరూ నల్లా దగ్గరికి పోయినారు. అప్పట్టే జనం మూగలే దింకా.

ఆ మసక చీకట్లోనే రెండు మూడు బిందెలతో తల స్నానం చేసి తడిచీర పిండుకుంటూ గుడిసె లోకి నడిచింది లక్ష్మమ్మ. ‘‘నువ్వూ రెండు బిందెలు పోస్కో, బాలమ్మా, పండగ నానం మబ్బున జేస్తె మంచిది’’ అని కూతుర్ని పురమాయించి.

తనలాగ కాదు. బుద్ధిమంతుడైన మొగుడు దొరకాలి బాలమ్మకి. మరి పండగనాడు నిద్దర లేవంగానే తల స్నానం చెయ్యకపోతే కోరనోము నోచినట్లే.

నల్లాకింద బిందె పెట్టి ధార స్నానం చేసింది బాలమ్మ. ‘ఏం పండగో యేమో! బొత్తుంగయీ పలిలె పండగ నానం పండగ నానమని ఈ పలిపీలు పోస్కొని లర్దంబడ్తె ఎవురు చేసేవోళ్ళు!’ అంటూ గొణిగింది పన్నాలుగేండ్లయినా పరమ సత్యాన్ని గ్రహించిన బాలమ్మ.

‘‘బాలమ్మ తల్లీ, నీకు పున్నెవుంటాది. జల్దీ నానం జేసి బయటపడు. కాల్చికి జల్దీ బోకుంటె నాలుగిండ్ల పని యెప్పటికి తెవులుద్ది!’’ గుడిసె లోనించే అరిచింది లక్ష్మమ్మ. జుట్టు పిండి తుడిచి కాస్త అరబెట్టుకున్నట్లు వదులుగా జారవిడిచింది. బాలమ్మ ధార పెద్దది జేసి నీళ్ళు నెత్తిమీద పోసుకుని

వణకడం, మళ్ళీ ధారకింద బిందె విప్పించి నెమ్మదైంది తను.

సీనారేకు పెట్టెలోంచి రెండేళ్ళ క్రితం మొగుడు మహారాజా—పట్నం మహారాణి యెట్టా వదిలిందో యేమోగాని— ఇదే పెద్ద పండక్కి వస్తూ కొని తెచ్చిన పోలీసు చిలుకు సీర తీసింది. తీసింది గానీ ఒంటికి చుట్టుకోలేకపోయింది లచ్చువమ్మ. ఏడాది నుంచి బాలమ్మ తల్లి చూపంతా ఈ చీరమీదే ఉందిగామా. ఒకరోజు పనులు జూసుకుని తను ఇంటికి వచ్చేసరికి పక్కింటి పనిపిల్ల సావిత్రీ, బాలమ్మా ఒకటే కిలకిల, కిచకిచ నవ్వుకోవటం విన్పించింది. వోరవేసున్న తలుపు సందులోనుంచి చూసింది తను. ఇదే పోలీస్చిలుకు సీరె నడుముకి చుట్టి పై వేసి పొంగిపోతూంది బాలమ్మ. "కట్టుకోరాదె, బాలా. మీ యమ్మొచ్చేతల్కి యిడిసేద్దూగాని" అంటూంది సావిత్రి గాని—"అమ్మో మాయమ్మే గనక జూసెనో!" అంటూ గుండెమీద చెయ్యేసుకుంది బాలమ్మ భయం చూపుతూ.

చీర మడిచి పెట్టెలో పెట్టేసింది లచ్చువమ్మ. తడి యింకా ఆరని జుట్టు నారపోచల్లాగ ఒట్టి ఒంటిమీద తగులుతూంది. రత్తమ్మగారిచ్చిన పాత చీరె దండెంమీదినుంచి తీసి చుట్టుకుంది. చీర చెంగుతో జుట్టును బరబర రాసి ముడివేసింది కుంకుమ పెట్టి. "ఓ బాలమ్మ తల్లీ, పొద్దయితా ఉంది" అని అరిచింది.

"వ్వ...వ్వ..." అని ఒణుక్కుంటూ గుడిసె లోకి వచ్చింది బాలమ్మ.

కూతుర్ని జుట్టు ఆరబెట్టుకొమ్మని ఈలోగా తను వాలుగు బిందెల నీళ్ళు ఇంట్లోకి పట్టింది లచ్చువమ్మ. ఇంకా ఇంద్రావగర్‌లోని గుడిసెల్లో కొన్ని బద్ధకంగా ఆవలిస్తూనే ఉన్నయ్.

పాలు పితికింది. రత్తమ్మ దొరసాని సాయం లోనే యీ బర్రెను కొనుక్కుంది తను. ఆ సాయంలో మూడొంతులు తీరిపోయింది గూడా. కాడ గిన్నెలో అర్ధశేరు పాలు పోసుకుని, "కాస్సేపో ఇన్నట్లో పని పూరజేస్కొని, అయ్యెంక రత్తమ్మగారింటికి రా బాలమ్మా. నే బోతన్నా. పాలు జాగర్త" అంటూ మసక చీకట్లో రోడ్డుమీదికి వచ్చిందాకా తను అరుస్తూనే ఉంది లచ్చువమ్మ.


"అయితే సాయె, అయితే సాయె" అంటూ బదు లరుస్తూనే ఉంది బాలమ్మ.

● ● ●

గేటు చప్పుడు విని మేడ గది కిటికీ తలుపులు తెరిచి చూసింది రత్నకుమారి. యేభయ్యోపడిలో పడుతూన్నా చిన్నప్పుడు, తలి దండ్రులు పెట్టిన 'కుమారి' అనే పేరు చివరన అట్లాగే మిగిలిపోయింది.

అవుట్ హౌసులో అద్దె కుంటున్న తను లేచి తాళం తీసి గేటు తీశాడు.

తమా లేచింది రత్నకుమారి. ఆకుపచ్చ రంగు విదేశీ స్వెటర్, మోకాళ్ళదాకా వేసుకున్న మేజోళ్ళలో శరీరం అసహనంగా కదిలింది. మంకీ కాప్‌లో ఆమె ముఖం పైకి భ్రుకుటి మీదికి వలిసి వచ్చి




కూర్చుంది తూష్ణీంభావన.

చివరికి అసహ్యతరమైన రొటీన్‌లోకి మారిపోతుంది తన జీవితం అని యెన్నడూ అనుకోలేదు తను.

ఆ మాట రోజుక్కనీసం మూడు సార్లయినా అనుకుంటుంది రత్నకుమారి.

కరిగిపోయిన కలా, తరగని పీడకలా—రెండూ పీడలే. ఇహ తను బతికున్న న్నాళ్ళూ ఆ రెండూ తనని వదలవు. విరగడంటూ జరిగితే—ఇది ఇట్లా ఎన్ని సార్లనుకుంటూ ఉంటుంది తను రోజూ?

మేడ మెట్లు దిగి వెళ్ళి తలుపు తీసింది.

అంత చలికాలపు తెల్లవారు జామునోనా లచ్చువమ్మ ముఖం మీద ఉదయ నమస్కారం లాగ చిరునవ్వు మెరిసింది.

మేడ మెట్ల వైపు తిరిగింది రత్న—"నీ కెన్ని సార్లు చెప్పాను, లచ్చువమ్మా! సుబ్బరంగా నువ్వూ, నీ బిడ్డా ఇక్కడే వచ్చి పడుకోవచ్చుగా. ఈ చలిలో తెల్లారుజామున్నే ఇంత దూరం నడిచి రావటం ఏం సుఖం చెప్పు! నాకైతే ఆ పడగ్గది విడిచి తలుపులు తియ్యడానికి కిందికి రావాలంటే ఎంత యాతన నిపిస్తుందో!"

తలుపులు భద్రంగా బిగించి వంటింటి వైపు నడుస్తున్నదల్లా, ఆ మాటకు నొచ్చుకున్నదేమో వంచగా మళ్ళీ ఒక నవ్వు నవ్వింది లచ్చువమ్మ.

అదంతా పట్టించుకో లేదు రత్నకుమారి. మేడ మెట్లెక్కుతుంటే సంపన్నమైన ఆమె జఘన భాగం కింద నిరుపేదల్లా మూలిగినయ్ కోమలమైన పాదాలు. కరుణామయుడైన తాత్త్వికునిలా ఆయాస పడిం దామె గుండె. సంసార బంధాన్ని ఛేదించుకుని కైవల్య పదానికై ఆరాటపడే జీవునిలా వెచ్చని మేడ గది మెత్తని పడకకై తొందరించిం దామె శరీరం.

చీకటైనా, చలైనా అవిచలిత చిత్తాన గూడు విడిచి, ఆకాశమార్గాన ఎగిరి వచ్చి, జీవన వ్యాపారంలో నిమగ్నమయ్యే పక్షిలా జానన్న తూపరానీ దగ్గిరికి చేరింది లచ్చువమ్మ. తన దైనందిన వృత్తిలో కుదిరిగ్గా వంగింది లచ్చువమ్మ శరీరం. చకచకా కదులుతున్న ఆమె చేతులపైన నరాలు నడక తప్పని గడియారపు సెకన్ల ముళ్ళులా కదులుతూన్నయ్. సమయం తప్పితే మరొక భావం చూపలేని గడియారపు ముఖమే ఆమె ముఖం. ఆమె పనికీ, ఆమె చూపుకీ, ఆమె కదలికకీ కుదిరిన సమశ్రుతి తెలతెల వార నున్నప్పటి దినగీతానికి ఆరంభ చిహ్నమై ఒప్పింది.

ఉత్తరాయణ బాలుడు బలంగా మెట్లెక్కేసరికి రత్నకుమారి దివి నుండి భువికి దిగి వచ్చింది.

అసరికి కాంతివంతమైన ఆమె చేతుల్లో మసలడానికి తగినట్లు తయారైంది పాత్ర సామగ్రి. ఆమె వేళ్ళలో మడుచుకు పోవడానికి ఉపక్రమణికగా సర్ఫు నీళ్ళలో జలకాలాడు తున్నయ్ పోలీసు సిల్కు చీరలు.

● ● ●

"అజిన దండకమండల మేఖలారుచిర పావన వామన మూర్తయే!" మేల్కొని చాలా సేపయినా అసహాయుడిగా పక్కమీదే మిగిలిపోయిన అచ్యుత రామయ్య ఎన్నో సార్లు కళ్ళు మూసుకుని చదువుకున్నాడు—రెండు చేతులూ తెరిచిన పుస్తకంలా కండ్ల ముందు పెట్టుకుని లక్ష్మీనివాసాన్నీ, సరస్వతీ నిలయాన్నీ, గోవిందధామాన్నీ కండ్ల కద్దుకున్నాడు.

ఎన్ని అక్షరాకృతుల్లో ధ్యానంలో నిలిపినా, తను ధ్యానించేది నిర్గుణ బ్రహ్మమే అనుకున్నాడు అలవాటుగా.

చక్రాల కాళ్ళను చేతులతో తిప్పుతూ నడవటం, పరుల చేతులపై నిలబడటం తన భాగ్యమైనాక సంధ్యలు, సంస్కారాలు బందై పోయినయ్ తనకి. శరీరం బెండు వదలిన ప్రాచీన వృక్షమైనాక, కోర్కెల ఆశల ఆకులు పూర్తిగా రాలిపోయి మనస్సు మోడయినాక, సగుణ బ్రహ్మమార్గాల పట్ల కొద్ది ఉపేక్షా భావం చోటు చేసుకుంది తనలో.


డెబ్బదెన్యో పడిలో ప్రతి వృద్ధుడు ఒక ముని. అన్ని దశకాల తన జీవిత ప్రసారంగా మిగిలిన తత్త్వన్ని మననం చేసుకుంటూ, స్వాతీకరించుకుంటూ అనుక్షణంగా తన జీవితాన్ని ఆలోచనల్లో పునర్నిర్మించుకుంటూ, ఒంటరితనమనే అడవిలోనే ఉంటూండే అతన్ని కాలమే నగుపుతూంటుంది.

ప్రతి దినమూ ఒకసారయినా తన జీవిత చక్రాన్ని పునరాలోకనం చేసుకుంటూ ఉంటాడు అచ్యుత

రామయ్య. అతను స్వయంగా 'తనను తాను నిర్మించుకున్న' మనిషి. యోగ్యులే జీవిత పోరాటంలో నెగ్గుతారన్న సూక్తిని ఆకళింపు చేసుకున్నాడు.

అతని ప్రవేశంతోనే అతని తల్లి నిష్క్రమణం జరిగిపోయింది. అదే కారణమేమో తెలీదు కాని— అతని మనస్సు, లేదా హృదయం అంటారేమో దానిలో ఒక పొరుగు పూర్తిగా మూసుకుపోయింది. అందులో ఉండే సులభంగా అక్షరాల్లోకి ఒదగని అనురాగం, స్పందన, ఆర్ద్రత ల్లాంటి బలహీన మనోగుణాల కవాటమి బయటికి రాకుండా అట్లాగే నిక్షిప్తంగా ఉండిపోయింది. అవి అట్లా ఉండి పోబట్టే అతను తనను తాను నిర్మించుకో గలిగాడు. సెల్ఫ్ మేడ్ మాన్ అంటే అంతేకదా!

పుట్టుకతోటే అచ్యుతరామయ్య అనుభూతి లోకి వచ్చిన సత్యం—పుట్టుక, చావులు మన ఇచ్ఛా నిచ్ఛలతో సంబంధం లేకుండా జరిగి పోయే ఘటనలని. నిరుపేదరికంలో పుట్టిన అతని ఒక అపురూప




మైన దరిద్రం ఏమంటే తలిదండ్రుల గురించిన స్మృతి గానీ, అవశేషం గాని ఏవీ లేకపోవటం. తల్లిది గానీ, తండ్రిది గానీ ఒక ఇల్లు గానీ, సెంటు ఆస్తి గానీ లేకపోతే మానె కనీసం, ఒక ఫోటో ఉండినా అతని జీవితం పూర్తిగా వేరే రీతిగా సాగిఉండేదేమో! అతని పొత్తిళ్ళ నాటి గుడ్డ పేలికల్లోనైనా తల్లి సుబ్బమ్మ చీరనుంచి గానీ, తండ్రి దశరథరామయ్య దోవతి నుంచి గానీ చిరిగి వచ్చిన పేలికొంటైనా లేదు.

సత్రంలో తనలాంటి గర్భ దరిద్రులతో పాటూ యాయవరం చేసుకుంటూ, కర్మకాండలు చేసుకునే వాళ్ళ ఇండ్లకి భోక్తగా వెళుతూ, అది ఎటువంటిదో ఒక ఘడియలో తనకీ, తన సతికీ సద్గతి కలిగించే సవాహటి చేయగలిగాడు దశరథరామయ్య. అయితే భార్య ప్రసవించే ముందు పెద్ద మందు కోసం వెళ్ళినవాడు—అది సంపాదించాడో, సంపాదించలేని పరిస్థితిలో దిక్కుతోచనే లేదో, ఏమయిందో ఎవరికి తెలుసు ఆరాటం పాలైన ఆ జీవికి తప్ప! భిక్షాటన మూర్తిగా తను పూళ్ళు వెళుతూ ఎప్పుడూ దాటే ఆ ఏటినంతా తడిమిన వాడు ఆ రోజున బాగా వరద నీరు తగిలిందికూడా చూసుకోకుండానే దిగి ఉత్తరించ

లేకపోయినాడు. మనిషి వరదలో కొట్టుకు పోతున్నాడంటే చూస్తూ పూరుకోలేని అనాగరకులైన గొడులు ఇద్దరూ తెప్పకొయ్యల్తీసుకుని యేట్లో బడి విధితో మల్లయుద్ధం చేసి మూడు మైళ్ళ దిగువన దశరథరామయ్య శవాన్ని ఒడ్డుకి లాక్కువచ్చారు. అప్పటికే ఆయనకీ, సుబ్బమ్మకీ సద్గతులు కలిగినయ్. పుడుతూనే తలిదండ్రులకు పుణ్యలోక ప్రాప్తి కలిగించాడు శిశు అచ్యుతుడు. ఆదే సత్రంలో ఉండే ముసలి దంపతులు శిశువుని చేరదీసి, తమ పిల్లలతో పాటూ పెంచారు. తప్పటడుగులు కొంచెం బాగా వేయగలిగిన నాటినుంచే చంకన జోలి కట్టుకుని మాధుకరానికి పోయినాడు అచ్యుతరామయ్య. బిచ్చపు బియ్యంతో జోలె ఎంత బరువైతే అంత సంతోషంగా రొప్పుతూ రోజుతూ తెచ్చి అమ్మ కిచ్చి అమాయకంగా నవ్వేవాడు.

ఈ పుట్టు బిచ్చగాని చేతిలో ఘనమైన భిక్షారేఖ ఉందని సంతోషించిన ఆయమ్మకూ తొందరలోనే నూరేళ్ళు నిండినయ్. ఆ తరవాత పిల్లల్లేరు, పెంచుకుంటానని పూటకూళ్ళ మనిషి ఒకావిడ వచ్చి పెంపుడు తండ్రికి పాతిక రూపాయ లిచ్చి అచ్యుతరామయ్యను తీసుకుపోయింది. కాస్త చదువు చెప్పించింది. పదేళ్ళు నిండేలోగానే వడుగు చేసింది. మంత్ర పుష్పం నేర్పించింది.

అచ్యుతరామయ్య విస్తళ్ళు వేసేవాడు. తీసేవాడు. మెచ్చాలు తెచ్చేవాడు. గల్లా పెట్టె దగ్గర కూర్చుని డబ్బు వసూలు చేసేవాడు. అట్లా పెరిగాడు. పెద్దవాడవుతూ వ్యాపారాన్నీ పెంచాడు. తాళం చేతులు అతని కిచ్చి నిశ్చింతగా వత్తుల పెట్టెనీ, రుద్రాక్ష మాలనీ తన చేతుల్లోకి తీసుకుంది ఆ అమ్మ. పూటకూళ్ళింటిని చిన్న హోటలుగా తీర్చి దిద్దాడు అచ్యుతరామయ్య. ఆ తరవాత ఆదీ 'అతనూ' ఇంతింతై పోయినారు.

• • -

ఇబ్బందిగా పక్కమీద అటూ ఇటూ కదిలేడు అచ్యుతరామయ్య. 'చాలా సేపయింద గదా లక్ష్మమ్మ వచ్చి?' రత్న విసుక్కుంటూ మేడ గది దిగి వచ్చి,



తలుపులు తీయడమూ, లక్ష్మమ్మ గొంతూ వినిపించక ముందే తను నిద్ర లేచాడు.

తన అవసరాల వేళలు తెలుసు లక్ష్మమ్మకి. తలుపుల దగ్గిరికి వచ్చిందాకా అడుగుల చప్పుడే వినిపించదు. అంత మెత్తని నడక లక్ష్మమ్మది. దగ్గిరికి వేసిన తలుపులు కొంచెం తెరిచి 'అయ్యా' అంటుంది. ఆ పిలుపు వినిపిస్తుందనే కాని, ఇంకా మెత్తన కాస్త వ్యవధిచ్చి మళ్ళీ 'అయ్యా' అంటుంది. శుష్కమైన నదిలో మోకాటిలోతు నీటిలో నుంచి ఒడ్డుకు నడిచి వచ్చినట్లు మెలకువ లోకి వస్తాడు తను. తల ఇటు తిప్పి అంటాడు — 'ఆ! వచ్చావా...మ్మా.''

''రానా, అయ్యా'' అంటుంది లక్ష్మమ్మ ఎంతో దయతో.

అసహాయంగా, బలహీనంగా, సిగ్గుగా కళ్ళు వాల్చుకుని తలూపుతాడు తను. తన కాలకృత్యాలు గడిచిపోతాయి. ఆ యమ్మ చేతుల మీదుగా, ఆ భుజాల ఆసరాతో లేచి చక్రాసనం లోకి మారతాడు తను. కాయబారిన ఆమె వేళ్ళ మృదువైన స్పర్శనే తలచుకుంటూ చేతులైనా కాళ్ళైనా చేతులే. కిటికీ దగ్గరగా వెళ్ళి రేడియో ట్యూన్ చేసి బయటికి చూస్తూ కూర్చుంటాడు.

మనుషులూ, సైకిళ్ళూ, కార్లూ, లారీలూ— క్షణం క్షణం మారుతూండే ప్రపంచం కనిపిస్తూంటుంది. ఒకప్పుడు తనూ ఈ ప్రపంచంలో భాగంగా ఉండేవాడు. తన దృష్టి అక్కణ్ణుంచి మారి రోడ్డు కిరు పక్కలా నిలుచుని తన లాగే చూస్తూండే పెద్ద పెద్ద చెట్ల పైకి పోతుంది. అక్కణ్ణుంచి తనకు తెలీకుండానే తన కళ్ళు ఆకాశం కేసి చూస్తూ పోతయ్. మనస్సు గిర్రున కదిలి పోయిన తన అరవై అయిదేళ్ళ జీవితాన్ని సంక్షిప్తం చేసి తిరిగి తిరిగీ చూసుకుంటూంది.

తలుపులు కొంచెం తెరిచిన చప్పుడు.

''వచ్చావామ్మా...'' అటు తిరిగాడు. ఊహుఁ లక్ష్మమ్మ గాదు గాలికి.

• • • •

లక్ష్మమ్మ బాసన్లు తోమి, బట్టలకు సబ్బు పెట్టి నానేసేపరికి కిందికి వచ్చింది రత్న. కాఫీ పెట్టి తను కాస్త తాగి, లక్ష్మమ్మకు పోసింది. తరవాత తలంటు స్నానం చేసింది. లక్ష్మమ్మ అతని గదికి వెళ్ళింది.

అతనికీ, ఆ లక్ష్మమ్మకే సరిపోయింది. అంత నికృష్టమైన స్థితిలో—చివరికి పనిమనుషుల దయాదాక్షిణ్యాల మీద ఆధారపడి బతికే దశలోకూడా ఆ మనిషిలో ఇంకా జీవించాలన్న ఎంత కఠోరమైన కాంక్ష! ఇంకా ఏం సాధించాలని? తనైతే ఆ స్థితిలో ముక్కు మూసుకుని చచ్చిపోయి ఉండేది. అతనూ అట్లా చెయ్యకూడదూ!

పాతికేళ్ళు ఈ మనిషితో ఎట్లా గడిపిందో తను! ఆశ్చర్యం!

తనను ఆరాధించి, ఆకాంక్షించి, జీవితాంతం తన పొందును ఆశించిన శ్రీకాంత్ మరో అమ్మాయిని పెళ్ళాడి, ఆశ్రయించి నిశ్చింతగా జీవితంగడిపెయ్యడం లేదూ? అవున...అవును—కాదా ఊహుఁ కాదు. ఆ


తరవాత అంటే అతనికి పెళ్ళైన తరవాతకూడా ఎన్నిసార్లు కోర్కెతో మండిపోతూ తనకు చేరువ కాలేదతను? ప్రేమ తుషారంలో చల్లార్చి పంపలేదు తను! ఈ వెర్రి బాగుల అచ్యుతరామయ్య డబ్బులతో ఆశాసౌధాల్ని కట్టుకుంటూ అక్కడ కూర్చుని ఉండగా డబ్బు, డబ్బు, డబ్బు ఏం కలవరించే వాడో మొదట్లో. తరవాత కాస్తంత తగ్గిందనే గాని ఆ డబ్బు దుగ్దతో ఏం సాధించు కున్నాడని!?

రత్నకు గుర్తుకు వచ్చింది ఇంట్లో తన తండ్రి దాచిన ఆఫీసు డబ్బు తీసుకుని శ్రీకాంతూ, తనూ మదరాసుకి సినిమాల్లో చేరడానికి వెళ్ళిపోవడం. తమ నిద్దర్శి చూడగానే—తను నాయికగా శ్రీకాంత్ నాయకుడుగా కొత్త సినిమా తీస్తానని ఎగిరి గంతెయ్యకపోతాడా దర్శకుడు ఎల్వీ ప్రసాదు అనుకుని వెళ్లేరు. కానీ ఆయన—"పిరికిగా పారి పోయి వచ్చిందానివి నాయికవేం అవుతావు?" అన్నాడు. ఎర్రతో లొక్కటి ఉన్నంత మాత్రాన నాయిక కావాలని ఎక్కడా లేదన్నాడు. నెమ్మదిగా మాట్లాడి నట్లే మాట్లాడి తన పూర్వూ, తండ్రీ వగయిరాలు తెలుసుకున్నాడు. ఆ రెండో రోజుకల్లా తండ్రి వచ్చి పడ్డాడు. పొద్దుట్నుంచే శ్రీకాంత్ జాడ లేకుండా పోయినాడు. తనూ, తండ్రీ ఇంటికి వచ్చేక ఎదురైన కఠిన సత్యం—మూడోకంటికి తెలియకుండా ఆ డబ్బు కట్టేస్తేనే తండ్రికి ఉరి తప్పేలాగుంది. ఇంకా చిన్న చదువుల్లో ఉన్న తమ్ముళ్ళు, తల్లిలేని ఇల్లు. ఈ పరిస్థితి నంతా పూర్తిగా గ్రహించే అప్పటికే తనకంటే పదిహేను సంవత్సరాలు పెద్దవాడైన అచ్యుత రామయ్య సంబంధాన్ని తెచ్చాడు నాన్న స్నేహితుడు. అతని బంగళా, బాంక్ బాలన్సూ, వర్ధిల్లుతున్న వ్యాపారమూ తన కళ్ళతో చూసేసరికి అన్పిం చింది—సినిమాల్లోకి వెళ్దామనుకున్నదీ ఇందుకోన పేగా అని. ఆ మొదటిసారే తనని మిడిగుడ్లేసుకుని చూస్తూండిపోయినాడు అచ్యుతరామయ్య. ఒప్పు కుంది తను. నాన్నకోసం కాదు. తమ్ముళ్ళకోసం కూడా కాదు. బంగళా, బాంక్ బాలన్సూ చూసి ఈ వర్తమాన మహావ్యాపారిని పెళ్ళాడింది. అప్పటికి తనకి— తప్పింది. పెళ్ళయిన ఎనిమిది నెలలకే బరువు తక్కువ కొడుకు పుడితే ప్రిమెచ్యూర్ బర్త్ అన్పించారు డాక్టరుచేత. అందు కెంత ఖర్చయిందో తెలీదుగాని, అచ్యుతరామయ్య పేద్ద పొంగిపోయినట్లేమీ కన్పించలేదు. అతనిపై ఆ శిశువుకంటే తన కన్నీళ్లే బాగా పని చేసేవి.

అచ్యుత రామయ్య కాంక్షలేని మనిషి. చాపల్యం లేని నాలుక అతనిది. భోజనం చేస్తున్నప్పుడు రుచీపచులతో నిమిత్తం లేదు. అదొక నిత్యకర్మ పూర్తి చేయడమే అన్నట్లుండే దతని ధోరణి. అలాంటి నిత్యకర్మలనుంచి అతని మనస్సు కేమీ అంటనట్లే కన్పించేవాడు. పిల్లాడు మూడో నెల రాకుండానే పోయినాడు. తనూ, ఎవరూ చూడకుండా శ్రీకాంతూ తప్పితే మరెవరూ కన్నీళ్ళు పెట్టలేదు. ఆ క్షణం నిజంగానే విషాద చిత్రంలో తనూ, అతనూ నాయకీ నాయకులమని భావన కలగడం గుర్తుంది.

మరపుకొస్తుంది.

తరువాత 'వర్ష', 'వాత', 'ఆతప' శైథిల్యంతో శరీర ధరాతలంలో ఎన్నో మార్పులు వచ్చాయి. అచ్యుతరామయ్య విచారించలేదు. వంశాంకురమంటూ కలవరించడ మటుంచి ఆ ప్రస్తావనే తేలే దెన్నడూ. తన ఆరోగ్యం కోసం ఖర్చుబడ్డాడు. తన సంతోషం కోసం ఖర్చుబెట్టాడు. ఆ తరువాత? సంవత్సరాలు దొర్లిపోయినయ్. మధ్యలో శ్రీకాంత్ అప్పుడప్పుడు వచ్చేవాడు. డబ్బు పట్టుకుని పోయేవాడు. "డబ్బు కోసం వచ్చేవా, నా కోసం వచ్చేవా?" అని ప్రశ్నిం చేది తను. 'ఛీ—వెధవ డబ్బు—నువ్వులేని డబ్బు నా కెందుకు, రత్నా' అనేవాడు. 'మనం చేసిన పొరబాటల్లా మరొకరి దగ్గరికి గాక, డైరెక్టర్ ప్రసాద్ దగ్గరికి వెళ్ళడమే'నని గుర్తుకొచ్చి నప్పుడల్లా బాధపడేవాడు. తను నవ్వి 'పోనీలే వచ్చే జన్మలో మరో దర్శకుడి దగ్గర కెళ్దాం' అనేది. అచ్యుతరామయ్య తన కళాభిరుచిని గుర్తించినట్లు




చూపడానికేమో తన గదిలో అజంతా గోడ బొమ్మల నమూనాల్ని పటం గట్టించి పెట్టేడు.

ఈ అచ్యుతుడికి శిశువుని కనలేక పోయినాననే బాధ తన కెప్పుడూ కలగలేదు. సృష్టిలో నిలవాల్సిన విలువ ఆ ప్రాణికి ఉంటే తప్పకుండా కనేదే తను. లేదూ అంటే అట్లా పోవడమే ఆ ప్రాణికి ప్రాప్తమన్న మాట. అట్లా తనదైన దంటూ ఒక తత్త్వం ఏర్పడింది తనకి. అతనికి సరే మొదట్నించి ఏదో ఉన్నట్లే కన్పించేవాడు. ఎవరి తత్త్వాన్ని వారు తర్కించుకుంటూ కాలం వెళ్ళబుచ్చడం నేర్చుకున్నారు.

అతను గుప్తంగా ఏమయినా దానం చేసే వాడేమో తెలియదు. తనుమాత్రం కొందరికిదాపరికం లేకుండా ఇచ్చింది. తన పేరుతో ఒక నాట్య పాఠశాల పెడితే పాతికవేలు దానం చేసింది. ఒక 'సౌందర్యశాల' పెడితే చందా ఇచ్చింది. కొన్ని ప్రేమ వివాహాలకు గుప్తంగా సాయం చేసింది. కొన్ని అతనికీ తెలుసు. తను చెక్కురాసి తీసుకెళ్తే వివరం చెప్పగానే సంతకం పెట్టేసేవాడు. తను సంపాదించుకున్న పుణ్యంలో అతనికీ వాటా

ఉంటుందిగదా అనేమో! పాపం, రూల్సు తెలి యవు. వెనకటి మనిషి!

ఇట్లా కొంత కాలం గడిచినాక అతని తత్త్వం పెడదారి తొక్కిందేమో అన్పించసాగింది తనకు. పెద్దవా డయిపోయినాడు. పేదరికాన్నీ, దుఃఖాన్నీ, రోగాన్నీ చూడగానే దుర్గతి అవలోకనం చేస్తున్న బోధి సత్త్వుని చూపు వచ్చేసేది అతని కళ్ళలోకి. ఏ అర్ధరాత్రో వెళ్ళిపోయి బోధి వృక్షం కింద కూర్చుంటాడా ఏం? అన్పించేది. వూళ్ళో దిక్కు లేకుండా చనిపోయిన అనాథ లెవరయినా ఉంటే వెంటనే అచ్యుతరామయ్యకు తెలిపేవాళ్ళు. అతను ముందున కొమ్ము పట్టాల్సిందే. తను చేసుకున్న వర్తమాన వ్యాపారి కాస్తా భూత వ్యాపారి అయిపోయి నాడు. హోటల్ పట్ల శ్రద్ధ తగ్గింది. గడ్డం పెంచేడు. శరీర సుఖాన్ని ఉపేక్ష చెయ్యడం మొదలు పెట్టేడు. తనకూ తండ్రి పోయినాడు. తమ్ములు పెద్దవాళ్ళయినారు. ఉద్యోగాల్లోకి వచ్చేరు. తనని మేనత్తని చేశారు.

అచ్యుతరామయ్యకు రక్తబంధువు లెవరూ లేరు. సగోత్రీకులు కొందరు మాత్రం అప్పుడప్పుడు వచ్చి రెండు మూడు రోజు లుండేవాళ్ళు. తమ పిల్లవాణ్ణి దత్తు చేసుకొమ్మని అడిగేవాళ్ళు. వాళ్ళతోటే, వీళ్ళ తోటే చెప్పించేవాళ్ళు. నిస్సంతుగా చనిపోతే సద్గతులు కలగవని, తల కొరివికైనా, తద్దినానికైనా కొడు కనబడే వాడొక డుండాలని చెప్పి చూశారు. చెప్పిందీ, చెప్పించిందీ అంతా వోపిగ్గా వినేవాడు.

● ● ● ●

లక్ష్మమ్మ తలుపులు వోర తీసింది. మేలు కొనుంటే ఒక్క పిలుపుకే పలుకుతాడు అయ్య. వోర తీసిన తలుపులో నుంచి తొంగి చూసింది.

అయ్య కిటికీ వైపే చూస్తున్నట్లు కన్పించేడు.

మళ్ళీ అంది లక్ష్మమ్మ—'అయ్యా.'

ఊహూ, పలక లేదు. పోనీ కొంచెం ఆగి రావచ్చునని వెనుకకు వెళ్ళింది లక్ష్మమ్మ.

ఇప్పటికి నాలుగు సంవత్సరాలయింది అయ్యకి కాళ్ళు పడిపోయి. తను అంతకుముందూ చూసింది. వూళ్ళో పోయిన దిక్కులేనివాళ్ళ శవాలన్నింటికీ తగలబెట్టడమైనా, పాతిపెట్టడమైనా అయ్యే పాడె

పట్టాల్సిందే. మంచివాడు. జాలి గుండె. అమ్మెంత చికాకు పడేదో. "ఈ పాడైన శ్లోకేమిటో యీనాకి" అని విసుక్కుంటూ ఉండేది. అయ్యమాత్రం మెత్తటి మనస్సున్న మనిషి. ఇంత మెత్తటి గుండె మనిషి ఇంత ఆస్తి ఎట్లా సంపాదించేడో? మోసం చెయ్యకుండా, అన్యాయం చెయ్యకుండా ఇంత డబ్బు సంపాదించగలుగుదురా ఎవరైనా? మోసమూ, అన్యాయమూ చేసిన చేతులేనా అయ్యవి! అయ్య సంపదంతా ఎవరు తినాలె!? రత్తమ్మ దొరసాని ఎవరికి పెడ్తుందో ఈ సొమ్మంతా! తనూ ఒక మాటు అయ్యని అడిగి చూస్తే "అయ్యా! ఒక చిన్న గుడిసె వేసుకుంటా. నీ పేరు చెప్పి దీపం పెట్టుకుంటా. నా కేదయినా తోవ చూపించు" అని. ఎన్నోసార్లు అనుకుంటుంది తను అడిగి చూడాలని. కాని—అయ్యని చూస్తే జాలి వేస్తుంది. గతి ఇట్లా అయిందని, చాకిరీ చేశాననిగదా లక్ష్మమ్మ అడగటానికి తెగించిందీ అనుకుంటాడేమో అయ్య! 'నీ ఋణాన బడ్డాను, తప్పించుకోలేనని గదా' అన్నట్లు చూస్తాడేమో!

లక్ష్మమ్మకి కళ్ళలో నీళ్ళు తిరిగినయ్. వద్దు. అయ్య నడగొద్దు. ఇంకా తన కెందుకు గుడిసెలూ, దీపాలూ. ఇంకో నాలుగు రోజులు. ఆ బాలమ్మ తల్లి నెవరి చేతిలోనైనా పెట్టేస్తే తనకున్న ఒకే ఒక్క బాధ్యత తీరిపోతుంది. దాని రాత బాగుంటే మిద్దే కట్టుకుంటుంది. తను ఓపిక ఉన్నన్నాళ్ళు, శరీరంలో సత్తువ ఉన్నన్నాళ్ళు పని చేస్తుంది. ఏ అయ్యో, అమ్మో ఇంత ముద్ద అన్నం పెట్టకపోరు. దేవుడు దయుంచి రోగానా రొష్టునా పడెయ్యకపోతే పని చేస్తూ పని చేస్తూనే ఎక్కడో కొమ్మమీది నుంచి పిట్టలా కన్ను మూసి పడిపోవాలి.

• • • •

గదిలో మేలుకునే పరధ్యానంలో ఉన్న అచ్యుత రామయ్యకు తను చూసింది కల అనుకో బుద్ధి కాలేదు. లేదు గానీ, అది నిజంగాదని కూడా అతనికి తెలుసు. ఇంతగా అతను కలత పడ్డానికి కారణం ఇన్నాళ్ళూ, ఇన్నేళ్ళూ ఎన్నోసార్లు కలగని ఉంటాడు. కానీ ఏ నాడూ కన్పించని అపూర్వమైన దృశ్యం ఈ ఉదయం ఘడియల్లో వచ్చింది.

మెరిసిపోతూన్న తెల్లని పట్టుబట్టలలో, చల్లని నవ్వులతో, తీర్చిన కుంకుమ బొట్టుతో, తెల్లని మబ్బుల్లోనుంచి దిగి వచ్చి తనకు "తలిదండ్రులు" ఉపదేశం చెయ్యడం—"నాయనా! అచ్యుతరాముడూ! ఎవరి ఋణంలోనూ పడకుండా వచ్చెయ్యి."

తను ఏమీ అడగలేక పోయినాడు. తండ్రినీ, తల్లినీ పుట్టుకతోనే కోల్పోయిన తను ఇట్లా ఈ రోజున వాళ్ళని చూడడం... అదీ ఈ రోజు! తను భూమ్మీద పడిన రోజు—వాళ్ళిద్దరూ కాయాన్ని వదిలిన రోజు!

ఏదీ — మళ్ళీ ఒకసారి!

అచ్యుతరామయ్య ఎంత ప్రయత్నించినా తలిదండ్రుల మూర్తి కనుల గట్టలేదు.

ఆ ఘడియకు మళ్ళీ జీవం రాదు.

"అయ్యా..." లక్ష్మమ్మ గొంతు.

"వచ్చేవా, లక్ష్మమ్మా" అటు తిరిగేడు అచ్యుత రామయ్య, చూపుల్లో కృతజ్ఞత చూపిస్తూ.

ఆమె చేతుల్లోని సహిష్ణుతతో, ఆ చూపుల్లోని దయా వాత్సల్యాలతో మళ్ళీ అచ్యుతరామయ్య శరీరం శుభ్రమైంది.

తెల్లని బట్టలు వేసుకుని చక్రాల కుర్చీలోకి మారేడు.

ఆలోచిస్తూంటే తనకే ఆశ్చర్య మన్పించింది అచ్యుతరామయ్యకు. తల్లితండ్రుల ఆబ్దికం, తన పుట్టిన రోజు—అన్నీ ఒక్క రోజునే సంఘటిల్లడం.

తనిలా స్థావర జీవి అవాలని రాసిపెట్టి ఉంది గనకనే గావచ్చు. ఏడేళ్ళ క్రితమే తీర్థయాత్రలు చేసి వచ్చేడు. రామఘట్టంలో, గయలో, బ్రహ్మకపాళంలో తలిదండ్రులకూ, పితృదేవతలకూ తర్పణం విడుస్తూ తనకూ పిండం వేసుకుని వచ్చేడు. ఈ నాలుగైదు సంవత్సరాల్నించి కుర్చీలో కూర్చుని ఎవరో ఒహరికి దానం చేసి నమస్కారం పెట్టుకోవడం తోనే సరిపుచ్చుకుంటున్నాడు.

ఈ రోజు పరిమిత సంస్కారంతోనే ముగించిన తరవాత అచ్యుతరామయ్య లాయరుకు ఫోన్ చేసి, రత్నను పిలిచేడు.

"ఇది నీ అదృష్టమో, నా అదృష్టమో, లేక

**నూతన యవ్వనం పొందండి. సంతానవంతులు కండి. చర్మవ్యాధుల నుండి విముక్తులు కండి.**



హస్త ప్రయోగము వలన కలుగు నరముల బలహీనత, శీఘ్ర స్ఖలనము, అంగము చిన్నదగుట, అవసర కాల మందు అసంతృప్తి, సంతానము లేకపోవుట, సమస్త చర్మ వ్యాధులకు అద్భుత చికిత్స. పోస్టుద్వారా చికిత్స కలదు

ప్రతి ఆదివారము భీమవరం - షణ్ముఖలాడ్జి నందు ఉ॥ 9 నుండి సా॥ 6-30 వరకు క్యాంపు కలదు.

డా॥ డి. మార్కండేయులు, ఆయుర్వేద భిషక్
సెక్స్ అండ్ స్కిన్ స్పెషలిస్ట్
పార్క్ రోడ్, గుడివాడ-521 301.
ఫోన్స్: 522 అండ్ 540

మీరు —మీ మనస్తత్వాన్ని తెలుసుకోవాలనుకుంటున్నారా?
—మీ గర్ల్ ఫ్రెండ్ ఎలాంటిదో కనుక్కో-వాలనుకుంటున్నారా?
—మీ స్నేహితుడి ప్రవర్తనని అంచనా వేయాలనుకుంటున్నారా?

12 రకాల చేతి వ్రాతలను విశ్లేషిస్తూ, మొట్టమొదటి సారిగా తెలుగులో వెలువడుతున్న 'గ్రాఫాలజీ' పుస్తకాన్ని

యండమూరి వీరేంద్రనాథ్ స్టిమ్యులేటింగ్ నవల

**'వెన్నెల్లో ఆడపిల్ల'** తో బాటు

ఉచితంగా పొందండి!

సెప్టెంబరు 30 విడుదల

• ఈ అవకాశం మొదటి ప్రచురణ వరకే పరిమితం।
త్వరపడండి!
వెల: 15 రూ. (లకే రెండు పుస్తకాలు!)

ప్రతులకు: నవసాహితి బుక్ హౌస్, ఏలూరు రోడ్డు, విజయవాడ-2.

29—9—82

మనిద్దరిదో తెలీకుండా ఉన్నది. కాని, నా మట్టుకు నాకు అసంతృప్తి ఏమీ లేదు. నా వంశం నిలబడ కుండా పోతుందే అనే మనో వ్యథ ఏమీలేదు నాకు. నా జీవితంలో ఈ రోజు చాలా ముఖ్యమైనది. నిజమే. కాని, ఇంతకు ముందెన్నడూ ఈ రోజు ననుభవించినంత చిత్తశాంతి కలగలేదు నాకు. బుద్ధి ఎరిగినప్పట్నించీ నన్ను అంటిపెట్టుకు వచ్చిన ఒక్క ఆర్తి ఈనాడు త్రుటికాలంలో తీరింది నాకు. ఈ జీవితకాలంలో ఏదైనా చేయలేక పోయానన్న అసంతృప్తి గానీ, ఏదో చేశానన్న సంతృప్తిగానీ నన్ను పీడించడం లేదు. ఈ అరవై అయిదు సంవత్సరాల లెక్క చూసుకున్నాను. వ్యాపారశేషం అటుగాని, ఇటు గాని లేదు.''

''ఏమి టిదంతా! ఇవాళేంటో సోది మొదలేశారు? అంది రత్న విస్తుపోతూ.

''ప్చ ...'' మాట్లాడకు అన్నట్లు వారించేడు అచ్యుతరామయ్య. ''నిన్ను పిల్చింది నే చెప్పేది విన టానికి. ఒక్క నీ విషయంలో మాత్రం నా నుంచి పొరపాటు జరిగిపోయుందేమో నన్న సందేహంమాత్రం ఉండిపోయింది. ఒక వేళ నా వల్ల నీకు అన్యాయం జరిగినట్లయితే ఈ వేళ మనఃస్ఫూర్తిగా క్షమాభిక్ష కోరుకుంటున్నాను.''


''రెండు చేతులెత్తి దండం పెడ్తూన్న అచ్యుత రామయ్య కేసి విస్తుపోతూ చూసి లేచింది రత్న. ''ఉండండి. డాక్టరుకు ఫోనయినా చేస్తాను.''

''ఒద్దు'' అచ్యుతరామయ్య శాంత గంభీర కంఠంతో అన్నాడు. ''డాక్టరును కాదు పిలవాల్సింది, లాయరును — ఫోన్ చేశాను. వస్తూండొచ్చు. వీలునామా రాస్తున్నాను. నువ్వు చెప్పాల్సిందేమయినా ఉంటే చెప్పు.''

తలవంచుకుంది రత్న. రెండు క్షణాలు ఆలోచించి అంది — ''ఏమీ లేదు. మీరే చెప్పండి.''

''అందుకే పిలిచే నన్నూయిగా—డబ్బూ, ఈ మేడా, కారూ. వీటితో నీ శేష జీవితం లోటులేకుండా గడుస్తుందేమో చూసుకో. అంతకంటే నీ కివ్వదగిన వేమీ లేవు నా దగ్గర. పోతే ఇంకా నడుస్తున్న హోటలుంది. లోగడే అమ్మెయ్యమన్నావు. లేకపోతే ఆ మేడ అనాథ శరణాలయాని కిమ్మన్నావు. గుర్తుందా చూడు, రత్నా! ఈ ప్రపంచంలో అనాథలంటూ ఎవరూ లేరు. మరొక విషయం. నీకు తెలుసో, తెలీదో నాకు తోబుట్టువు లున్నారు.''

విస్మయపోతూ చూసిన రత్నకేసి చూసి నవ్వేడు అచ్యుతరామయ్య. ''దాదాపు ముప్పై సంవత్సరాల క్రితం నుంచీ అప్పుడప్పుడు వచ్చి చేరిన తోబుట్టువులు. వాళ్ళలో కొందర్నయినా నువ్వెరుగుదువో, లేదో గాని కొందర్ని కొన్నిసార్లయినా చూసి ఉంటావు. వాళ్ళలో కొందరికి పెళ్ళాలు, పిల్లలు ఉన్నారు. వాళ్ళ కోరిక లెట్లాంటివో తెలుసుకునే ప్రయత్నం చెయ్య లేదు నేను. అసలు తీరనివే నేమో నిజమైన కోరిక లంటే! సరే, పోనీ. సోది ఎందుగ్గాని ... సంగతి చెబుతున్నాను, చూడు. హోటల్లో పనిచేసే సర్వర్లూ, క్లీనర్లూ, వంటవాళ్ళూ అంతా కలిసి వో పాతిక మంది ఉంటారు. వాళ్ళే నా తోబుట్టువులు. హుఁ! ఏంటట్లా చూస్తున్నావు? చమత్కారంలా గుందా?




లేదు—నా పక్షం నుంచి నిజం చెబుతున్నాను. వాళ్ళు నాతో రక్తాన్ని పంచుకోకపోయ్యుండొచ్చు. రక్తాన్ని పంచుకున్న భ్రాతృత్వం ఆస్తి పంచుకోవడంతో సమాప్తమవుతుంది. కానీ వీళ్ళంతా నా తోటి చెమటను, కష్ట సుఖాల్ని పంచుకున్నారు. భ్రాతృత్వాని కింతకంటే దృఢమైన ప్రత్యక్ష సాక్ష్యం ఉంటుందేమో నాకయితే తెలీదు. నే చదివింది ఒకటే పుస్తకం—'జీవితం'. అది అందరూ చదివేదే. కానీ దాన్నుంచి నాకు తోచిన అర్థమైతే ఇది. హోటల్ని వాళ్ళకి సమష్టిగా రాసేస్తున్నాను.''

రత్నకు నోటి వెంట మాట రాలేదు. ఎప్పుడూ ఇతని నోట నాలుగు మాటలకంటే ఎక్కువ రాలేదు. కనీసం తను వినలేదు. తలెత్తి చూసిన రత్నకు ఎట్లాంటి భావోద్వేగమూ లేని అచ్యుతరామయ్య ముఖాన ఒక ధీరకాంతి కన్పించింది.

''ఇక పోతే మా అమ్మ. ఆమె కూడా నా పుట్టిన రోజే చనిపోయిందని నే ననుకున్నాను. కానీ, నాలుగేళ్ళ కిందటే తెలిసింది ఆమె చనిపోలేదని. చిన్నతనంలో పాలిచ్చినాడు నాకు ఆమె చెయ్యలే దనుకున్న సేవ ఈ నాలుగేళ్ళుగా చేస్తోంది. అమ్మకు నే నో ఇంటి కోసం ఏర్పాటు చేస్తున్నాను. ఆమె సేవకు విలువ కట్టి కాదు సుమా. ఆమెది భూదేవి అంత సహనం. ఆమె అగర్భ దరిద్రురాలూ, దీనమాతా. మేడల్లో, మిద్దెల్లో ఇమిడి ఉండలే దామె. అందుకే ఒక చిన్న పూరింటికోసం ఏర్పాటు చేస్తున్నాను.'' అచ్యుత రామయ్య నిట్టూర్చేడు. చేతితో పేపరు మీద రెండు పాదరసపు చుక్కలు పడ్డట్టు చప్పుడైంది.

''మరో మాట. ఈ ఇంటికి అచ్యుత నిలయం అన్న పేరు మార్పించు. నీ ఇష్టం వచ్చిన పేరు పెట్టుకో. 'అచ్యుతవిలాస్' గురించి ఇదే కోరిక వీలునామాలో రాయిస్తున్నాను.''

రత్న మాట్లాడలేదు. తల ఎత్త లేదు. బరువైన ఆలోచనలలో పడిపోయిం దామె మనస్సు.

''ఎవరైనా కుర్రాణ్ణి పెంచుకోవా లన్పిస్తే పెంచుకో. ఆ విషయంలో నీకు సంపూర్ణ స్వేచ్ఛ ఉంటుంది. కాని, నీ కొడుకుగానే సుమా. నాకెవ్వరూ ఋణగ్రస్తులు లేరు. నే నందరి ఋణం తీర్చు కున్నానో, లేదో గాని — ఎవరికీ ఏమీ బాకీ లేకుండా పోవాలని నా తాపత్రయం.

బయట కారాగిన చప్పుడు విన్పించింది.

• • • •

సాయంసంధ్య వేళ. చక్రాల కుర్చీలో కూర్చుని కిటికీలోంచి బయటకు చూస్తున్నాడు అచ్యుత రామయ్య.

విద్యుత్తులేని సాయంత్రం. వీధిలో జనసంచారం తక్కువగా ఉంది. పక్షులు అరుస్తూ ఎగురు తున్నాయ్. పడమట వెలవెలబోతూంది ఆకాశం.

ఉదయ, సాయం సంధ్యలు రెండూ ఒకేలా ఉంటాయ్ అన్పించింది అచ్యుతరామయ్యకు. తెలతెల వారే వెలుగు, వెలవెలబోయే తెలుపూ — ఇట్లాంటి సంధ్యా సమయా లనేకం చూశాడు తను. ఇవ్వాళ తనని ఒక అవ్యక్తమైన శాంతి ఆవరించి ఉంది.

సన్నగా తలుపులు వోరతీసిన చప్పుడైంది.

''అయ్యా!''

అచ్యుతరామయ్య అటు తిరిగేడు. ''వచ్చేవామ్మా!''

లోనికి వచ్చింది లక్ష్మమ్మ. ''అయ్యా! ఏమయినా పనుందా?''

''కాస్త ... ఆ మంచం మీదికి ...''

''అట్టనే!'' మెల్లగా తన చేతుల ఆసరాతో మంచం మీదికి చేర్చింది లక్ష్మమ్మ.

''కాసిని మంచినీళ్ళు కావాలమ్మా!'' మంచంలో అలసటగా అన్నాడు అచ్యుతరామయ్య.

''అట్టనే, అయ్యా ...''

మంచినీళ్ళతో వచ్చి ''అయ్యా'' అంది లక్ష్మమ్మ.

గదిలో వెలుగు లేదు. ''అయ్యా!''మళ్ళీ పిలిచింది.

''అమ్మా! కాసిని మంచినీరు.'' నిద్రకొచ్చిన శిశువులా అన్నాడు అచ్యుతరామయ్య.

లక్ష్మమ్మ గుండె దడదడ లాడింది. ''అయ్యా!'' గ్లాసుతో ముందుకు వంగింది. ముఖంలోకి చూసింది.

అయ్య కళ్ళు తెరిచే ఉన్నట్లున్నయ్ గాని, దేన్నీ చూస్తున్నట్లు లేదు. అదే వాలకంలో అన్నాడు ''అమ్మా — నీరు...''

''అయ్యా...'' కంగారుగా అయ్య తలని కొంచెం ఎత్తి చేతిని ఆసరాగా ఉంచి, ''నీలు — నీలయ్యా, నీలు'' అంటూ వో ఉద్ధరిణెడు నీళ్ళు పోసింది లక్ష్మమ్మ. ★